సాక్షి
జగిత్యాల
సోమవారం । 20 । జనవరి । 2025



అటకెక్కిన పరిశోధన స్థానం

జగిత్యాలలోని పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని ప్రకటించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. -8లో▸



రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ

వేములవాడ రాజన్నను ఆదివారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిగా ఉంటుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

క్రికెట్ ఆడిన జడ్జిలు, అడ్వకేట్లు



పోటీలకు సిద్ధమైన జడ్జి, అడ్వకేట్ల జట్లు

జగిత్యాలజోన్: నాలుగు గోడల మధ్య నల్లకోటుతో బిజీగా ఉండే జడ్జిలు, అడ్వకేట్లు ఆదివారం కాసేపు మైదానంలోకి చేరి క్రికెట్ ఆడారు. జడ్జిలు ఒక జట్టుగా.. న్యాయవాదులు మరో జట్టుగా ఏర్పడ్డారు. ఈ పోటీలో ప్రెసిడెంట్ ఎలెవన్ జట్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎలెవన్ జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ, మొదటి అదనపు జిల్లా జడ్జి సుగాళి నారాయణ, రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ జితేందర్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గంప కరుణాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు ముదుగంటి జనార్దన్ రెడ్డి, ఎస్.మురళీధర్ రావు బ్యాటింగ్, బౌలింగ్ చేసి తమతమ జట్టు క్రీడాకారులను ఉత్సాహ పర్చారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేస్తున్న మేజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు, జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఆదివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. వీటిని మేజిస్ట్రేట్‌లు ప్రారంభించారు. మేజిస్ట్రేట్, బార్ అసోసియేషన్ టీంలుగా తలపడగా.. బార్ అసోసియేషన్ టీం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, పలువురు న్యాయవాదులు ఉన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

జగిత్యాల: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌కు ప్రజలు ఎవరూ రావద్దని, ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల సర్వేలో అధికారులు పాల్గొంటున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

గోదావరిలో పుణ్య స్నానాలు



పుణ్యస్నానాలు చేస్తున్న మహిళలు

రాయికల్: పుష్యమాసం సందర్భంగా రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామ శివారులోని గోదావరిలో భక్తులు ఆదివారం పుణ్యస్నానాలు ఆచరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్నానాలు చేసి గోదారమ్మకు మొక్కులు చెల్లించారు.

వస్తువుల విక్రయాలకు నేడు వేలం

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో వివిధ వస్తువుల విక్రయాలకు సోమవారం వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య తెలిపారు. వేలం దక్కించుకున్న వారు ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నుంచి వచ్చే ఏడాది జనవరి 31వరకు అమ్మకాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొబ్బరికాయలు, బెల్లం, పూజాసామగ్రి అమ్ముకునేందుకు వేలంలో పాల్గొనేవారు రూ.2లక్షలు డిపాజిట్ చేయాలని, పూలు, పూలదండలు, పండ్ల అమ్మకాలకు రూ.10వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. ఇతరత్రా విక్రయాలకు కూడా బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు.

మహాసభ విజయవంతం చేయాలి

జగిత్యాల: సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని శ్రీరామ థియేటర్ ఎదురుగా ఉన్న పైప్‌లైన్. మూడునెలలుగా లీకేజీ అవుతోంది. అయినా మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో నీరంతా వృథాగా పోతోంది. నీటి సరఫరా నిలిపివేసినప్పుడు ఈ నీరంతా తిరిగి పైప్‌లైన్‌లోకి వెళ్లి తాగునీరు కలుషితం అవుతోంది. అక్కడున్న ప్రజలు లీకేజీ అరికట్టాలని ఫిర్యాదు చేసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.



ఈ చిత్రం మహిళా డిగ్రీ కళాశాల ముందు గల యావర్ రోడ్డు. ఇక్కడి పైప్‌లైన్ దాదాపు రెండు నెలలుగా లీకేజీ అవుతోంది. కనీసం పట్టించుకునేవారు కరువయ్యారు. అక్కడ చిరువ్యాపారులు తమతమ వ్యాపారాలు చేసుకుంటారు. నీరు లీకేజీతో అక్కడ కూర్చోలేని పరిస్థితి నెలకొంది.

- ఎక్కడ చూసినా లీకేజీలే
- అధ్వానంగా పైప్‌లైన్లు
- అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు
- జగిత్యాల బల్దియాలో నల్లా కనెక్షన్లు 12 వేలు
- ప్రతిరోజు నీటి సరఫరా 16.5 ఎంఎల్‌డీ
- ప్రజలకు అవసరమైన నీరు 21 ఎంఎల్‌డీ

జగిత్యాల: జగిత్యాల బల్దియాలో తాగునీటి సరఫరా అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా లీకేజీలే. దీంతో ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడుతోంది. జగిత్యాలలో ప్రధాన ఫిల్టర్‌బెడ్ నుంచి నాలుగు ట్యాంక్‌లకు సరఫరా అవుతోంది. ఫిల్టర్‌బెడ్ నుంచి ప్రధానంగా వచ్చే పైపులు చాలాచోట్ల లీకేజీ అవుతున్నాయి. తద్వారా వేల లీటర్ల నీరు వృథాగా పోతోంది. ఎప్పుడో మున్సిపాలిటీ ఏర్పడినప్పుడు వేసిన పైప్‌లైన్ కావడంతో తరచూ లీకేజీ అవుతున్నాయని, దీంతో వాటికి మరమ్మతు చేయించలేకపోతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కూడా అధ్వానంగా మారి ప్రజలకు నీరు అందకుండా పోతోంది.

మిషన్ భగీరథ అస్తవ్యస్తం..

ప్రతి ఇంటికీ నీరు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మున్సిపాలిటీలోని ప్రతి వార్డు.. ప్రతి ఇంటికీ పైప్‌లైన్ వేయించింది. అయితే పైప్‌లైన్ కోసం చాలాచోట్ల తవ్వడం, తవ్విన చోట సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పనులతో పాతలైన్ పూర్తిగా పగిలిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ప్రతి కాలనీలో రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. లీకేజీతో నీరు కలుషితం అవుతోందని, నీరు మురికిగా వస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



లీకేజీలపై చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీలో ఎక్కడెక్కడ లీకేజీలు అవుతున్నాయో గుర్తించి వాటిని అరికట్టి నీరు వృథా కాకుండా చూస్తాం. ప్రధాన చోట్ల లీకేజీలు కాకుండా గుర్తించాం. వాటికి మరమ్మతు చేయించి నీరు కలుషితం కాకుండా చూస్తాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

‘గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా’ విడుదల చేయండి

జగిత్యాల క్రైం: గల్ఫ్‌లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రకటించిన రూ.4.70 కోట్లు తక్షణమే విడుదల చేయాలని గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ కాంగ్రెస్ నాయకులు సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబును కలిసి విజ్ఞప్తి చేశారు. ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసినా.. నిధుల విడుదలలో జాప్యం కారణంగా బాధిత కుటుంబాలు సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. జగిత్యాలలో 31 మంది, నిజామాబాద్‌లో 28, రాజన్న సిరిసిల్లలో 8, కామారెడ్డి, సిద్దిపేటలో నలుగురు, కరీంనగర్, మంచిర్యాలలో ముగ్గురు, మెదక్‌లో ఇద్దరు, వరంగల్, హన్మకొండ, పెద్దపల్లి, నల్గొండ, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కో కుటుంబానికి మంజూరు పత్రాలు జారీ చేశారని, మొత్తం 94 కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించారని నాయకులు పేర్కొన్నారు. గల్ఫ్, సింగపూర్, ఇరాక్, మలేసియాతోపాటు 18 ఈసీఆర్ దేశాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని మంద భీంరెడ్డి, దేవేందర్‌రెడ్డి సీఎంను కోరారు.



సీఎం, మంత్రిని కలిసిన ఎన్‌ఆర్‌ఐ కాంగ్రెస్‌నాయకులు

ఆరోగ్యశ్రీ వినియోగించుకోవాలి

- సాగుకు యోగ్యమైన భూమికే రైతుభరోసా..
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోకంటే ఎక్కువగానే ప్రజాసంక్షేమ పథకాలను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఏకకాలంలో రుణమాఫీ అయ్యిందని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సన్నాలకు బోనస్ ఇచ్చామని, త్వరలోనే అందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. రైతుభరోసా సాగు యోగ్యమైన భూమికే వస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మీ, గాజెంగి నందయ్య, బండ శంకర్, రాజేందర్ ఉన్నారు.



పోతారంలో మల్లన్న బోనాలు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామంలో లొంక మల్లన్న బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపు చేయగా... ఒగ్గు కళాకారుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. బోనాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జూదం.. ఆదాయం



ఈ చిత్రం మెట్‌పల్లి మండలంలోని కోనరావుపేట శివారు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తుండగా పట్టుబడిన పేకాట శిబిరం. కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి దీనిని నిర్వహిస్తున్నాడు. పేకాటరాయుళ్లను అక్కడకు రప్పించి.. వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడు. గుట్టుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంపై ఇటీవల పోలీసులు దాడి జరిపి 12మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఈ ఒక్క చోటనే కాదు.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చాలా మంది పేకాట శిబిరాలను నిర్వహిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

- జిల్లాలో జోరుగా పేకాట దందా
- శిబిరాలతో సులభంగా సంపాదన
- ‘మామూలు’గా తీసుకుంటున్న పోలీసులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

మెట్‌పల్లి: జిల్లాలో పేకాట దందా జోరుగా సాగుతోంది. కొందరు గుట్టుగా శిబిరాలు నిర్వహిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము చూసుకుంటామని పేకాటరాయుళ్లకు భరోసా ఇస్తూ వారి నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. కొన్ని చోట్ల ఈ దందాకు పోలీసులు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. పేకాటతో నిర్వాహకులు జేబులు నింపుకుంటుంటే.. ఆడుతున్న వారిలో ఎంతోమంది ఆర్థికంగా చితికిపోయి ఇబ్బంది పడుతున్నారు.

మామిడి తోటలు.. అటవీ ప్రాంతాల్లో శిబిరాలు

- నిర్వాహకులు పేకాట శిబిరాల విషయంలో పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు.
- పోలీసుల దృష్టిలో పడకుండా గ్రామాలకు దూరంగా ఉండే మామిడితోటలు, అటవీ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు.
- అక్కడకు వచ్చే వారికి పోలీసుల దాడులు జరగకుండా అన్నీ తాము చూసుకుంటామని నమ్మిస్తూ రప్పిస్తున్నారు.
- జూదరులను ఆకట్టుకోవడానికి శిబిరాల్లో మందు, నాన్‌వెజ్ వంటకాలతో విందును ఏర్పాటు చేస్తున్నారు.
- శిబిరాలను కొన్ని రోజులు ఒకచోట.. మరికొద్ది రోజులు మరో చోటుకు తరలిస్తున్నారు.

నిర్వాహకులకు భారీగా ఆదాయం

- పేకాట దందాతో నిర్వాహకులు ప్రతిరోజూ రూ.వేలల్లో ఆదాయాన్ని పొందుతున్నారు.
- శిబిరాల్లో రూ.5వేలు మొదలు రూ.10వేల వరకు ఆడుతారు.
- ఎంత ఆట ఆడితే అంత మొత్తాన్ని ముందుగానే నిర్వాహకులు తీసుకుంటారు.
- వచ్చిన ఆదాయం నుంచే జూదరులకు మందు, విందు ఇతర వసతులకు ఖర్చు చేస్తున్నారు.

‘మామూలు’గా తీసుకుంటున్న పోలీసులు

- పేకాట శిబిరాల నిర్వాహకుల్లో ఎక్కువ మంది రాజకీయ నాయకులు ఉన్నారనే ప్రచారం ఉంది.
- వీరు స్థానిక పోలీసులకు నెల వారీగా మామూళ్లు ఇస్తూ శిబిరాలను దర్జాగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.
- గ్రామాలు, పట్టణాల్లో కొందరికి పేకాట తప్ప వేరే వ్యాపకం లేదు. అలాంటి వారు ప్రతిరోజు ఎక్కడో ఓ చోట ఆడుతారు.
- వారిపై నిఘా పెడితే శిబిరాల ఆచూకీని కనిపెట్టే అవకాశముంటుంది.
- పోలీసులు అలా చేయకపోవడం విమర్శలకు తావిస్తుంది.

ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలు

- పేకాటతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.
- కొందరు రూ.లక్షలు పోగొట్టుకుని మరికొందరు ఆస్తులను అమ్ముకొని అప్పుల పాలు కావడంతో వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.
- ‘మామూలు’గా తీసుకుంటున్న పోలీసులు ఈ దందా పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.
- ఉన్నతాధికారులు స్పందించి పేకాటను నియంత్రించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాటపై దృష్టి పెట్టాం



పేకాటపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎక్కడైనా శి బిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు ఆ స మాచారాన్ని పోలీసులకు అందించాలి. అవసరమైతే డయల్ 100కు ఫోన్ చేయాలి. శిబిరా ల నిర్వాహకులు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తి లేదు. పట్టుకొని వారిపై కేసులు నమో దు చేస్తాం.

– నిరంజన్‌రెడ్డి, సీఐ, మెట్‌పల్లి

రాష్ట్రంలో నియంత పాలన

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బాపురెడ్డి



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

కథలాపూర్: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు జాప్యం చేయడం దారుణమన్నారు. హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతలపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేయించడమేంటని ప్రశ్నించారు. రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తేనే పసుపు బోర్డు ఏర్పాటైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతలు తీసుకొని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఉద్యమాలు కొత్త కాదని, ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని వెల్లడించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు బాల్క సంజీవ్, గంద్ర గంగారావు, విజయ, వంగ మహేందర్, తెడ్డు ప్రశాంత్, తిరు జానీ, బద్దం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణమాఫీపై అయోమయం

- మాఫీ కావాల్సిన రైతులు 60 వేలకు పైగానే
- కలెక్టర్‌కు దరఖాస్తులు ఇస్తున్న రైతులు
- రుణమాఫీకి అర్హులు 1,43, 274 మంది
- ఇప్పటివరకు అయ్యింది 80,515 మందికే..



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మోరపల్లి రైతులు (ఫైల్)

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రూ.రెండు లక్షల పంట రుణం మాఫీ కాని రైతుల్లో అయోమయం నెలకొంది. వంద శాతం మాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. జిల్లాలో మాఫీ కాని రైతులు ఇంకా 60వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. ఇప్పటివరకు నాలుగు విడతల్లో కలిపి 80,515 మంది రైతులకు రూ.721.74 కోట్లు అందాయి.

రుణమాఫీకి అర్హులు 1,43, 274 మంది

ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న పంటరుణం మాత్రమే ప్రభుత్వం మాఫీ చేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ లెక్కన జిల్లాలో అర్హులైన రైతులు 1,43, 274 మంది వరకు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 80,515 మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. ఇంకా 62, 759 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంది.

మాఫీకి అడ్డంకులు

రూ.2 లక్షల రుణం కంటే వడ్డీ ఎక్కువ ఉన్న రైతులు జిల్లాలో 1147 మంది ఉన్నారు. అలాగే ఆధార్ నంబర్‌లో పేరు, రుణ ఖాతాలో పేరు వేర్వేరుగా ఉన్న రైతులు 1189 మంది ఉన్నారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, పింఛన్‌దారులు ఉన్న రైతులు 3,766 మంది ఉన్నారు. అలాగే రుణఖాతా, బ్యాంకు సమస్య ఉన్న వారు 542 మంది ఉన్నారు. నిధుల బదిలీ ప్రాసెస్‌లో ఉన్నవారు 24,119 మంది ఉన్నారు. మైనర్ పేరిట పంట రుణం తీసుకున్న రైతులు 16 మంది, ఒకటి కంటే ఎక్కువ రుణ ఖాతాలు ఉన్న రైతులు 150 మంది వరకు ఉన్నారు. ఒకే కస్టమర్ ఐడీ.. వేరువేరు ఆధార్‌నంబర్ల మ్యాప్ చేయబడిన రైతులు 230, బంగారం కుదవపెట్టి పంట రుణం తీసుకున్న రైతులు 24,450 మంది, పట్టాదారు పాస్ పుస్తకం లేనివారు 7,097 మంది ఉన్నారు. ఆడిట్ సమస్యతో రుణమాఫీ కాని రైతులు 22 మంది ఉన్నారు. ఇలా.. వివిధ రకాల సమస్యలు, కారణాలతో 62,728 మంది రైతులకు రుణమాఫీ కాలేదు.

క్షేత్ర స్థాయిలో సమస్యలతోనే

పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులు కొందరు విదేశాలకు వెళ్లగా.. వారి పేరిట భార్యలు పంట రుణం తీసుకున్నారు. ప్రభుత్వ పోర్టల్‌లో భార్య పేరు మీద భూమి కనబడకపోవడంతో వారి రుణమాఫీ కాలేదు. భార్య గోల్డ్‌లోన్, భర్త భూమిపై తీసుకున్న రుణం రూ.2 లక్షలు దాటనప్పటికీ వారి రుణమాఫీ కాక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కుటుంబసమస్యలతో మైనర్ల పేరు మీద భూమి ఉంటే.. వారికి బ్యాంకులు రుణం మంజూరు చేసినప్పటికీ వారికి మాఫీ వర్తించలేదు. రూ.రెండు లక్షలపైగా ఉన్న రుణంతోపాటు వడ్డీని రైతులు చెల్లించిన వారికీ మాఫీ వర్తించలే. ఇలా.. రకరకాల సమస్యలతో పంట రుణమాఫీ కాకపోవడంపై గ్రామాల్లోని రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం మాత్రం రైతులందరికీ పంట రుణమాఫీ చేశామని ప్రకటిస్తుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రభుత్వానికి వివరాలు పంపిస్తున్నాం



నాలుగు విడతల్లో కలిపి జిల్లా రైతులకు రూ.721 కోట్లు పంట రుణమాఫీ అయ్యింది. సాంకేతిక కారణాలతో కొందరికి మాఫీ కాలేదు. సమస్యలు ఉన్న రైతుల వివరాలు సేకరించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపిస్తున్నాం.

– రాంచందర్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కప్ అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో నూకలమర్రి, చెక్కపల్లి జట్లు పోటీ పడ్డాయి. విజేతగా నూకలమర్రి, రెండో స్థానంలో చెక్కపల్లి, మూడోస్థానంలో అనుపురం, నాలుగో స్థానంలో మానాల జట్లు నిలిచాయి. ఆయా జట్లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోనరావుపేట(వేములవాడ): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం రామన్నపల్లెకు చెందిన బత్తుల మల్లయ్య(35) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై బావుసాయిపేట వెళ్తున్నాడు. రామన్నపల్లె శివారులో వాహనం అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

తండ్రీకూతురికి గాయాలు..

గోదావరిఖని(రామగుండం): రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురికి గాయాలయ్యాయి. గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం.. గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన దొంగరి రాజమౌళి తన కూతురు తేజస్విని ఆదివారం ద్విచక్రవాహనంపై సింగరేణి జీఎం ఆఫీస్ వైపు వెళ్తున్నారు. వంకబెండు వద్ద మహమ్మద్ వహీద్ బైక్‌పై వచ్చి, ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తండ్రీకూతురు గాయపడ్డారు. కుటుంబసభ్యులు వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. రాజమౌళి తోడల్లుడు రాంచందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యానికి బానిసైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ(45) మద్యానికి బానిసైంది. నిత్యం డబ్బుల కోసం కూతురు పూజితను వేధిస్తోంది. ఆమె డబ్బులివ్వకుండా మద్యం సేవిస్తే అవయవాలు పాడవుతాయని బెదిరించింది. దీంతో మనస్తాపానికి గురైన నర్సవ్వ శనివారం రాత్రి తమ ఇంటికి ఎదురుగా ఉన్న వ్యవసాయ బావిలో దూకింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం బావిలో చూడగా నర్సవ్వ మృతదేహం కనిపించింది. మృతురాలి భర్త రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటకెక్కిన ఆవాల పరిశోధన స్థానం



పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం

- ప్రకటించి మూడేళ్లయినా అతీగతీ లేదు
- తాత్సారం చేస్తున్న జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి



జగిత్యాల జిల్లాలో సాగు చేసిన ఆవాల పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని ప్రకటించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ఎలాంటి పురోగతి లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటికీ నిధులు విడుదల చేయకపోగా, శాస్త్రవేత్తలను నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధన స్థానం అటకెక్కినట్లేనని రైతులు ముచ్చటించుకుంటున్నారు.

ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనే దాదాపు 50 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. సాగుకు అవసరమైన ఎర్రనేలలు ఆయా జిల్లాల్లో ఉండటం, సాగునీటి వసతి, 80–90 రోజుల్లోనే పంట చేతికి రావడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆవాల పంట ద్వారా తేనెటీగలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. రైతులు కొద్దిపాటి శిక్షణతో తేనెను ఉత్పత్తి చేసి మరింత ఆదాయం పొందవచ్చని, మన జిల్లాలో మామిడి ఎక్కువగా ఉండటంతో తేనెటీగల వల్ల పరాపరాగ సంపర్కం జరిగి పిందె, కాయ వృద్ధి చెందే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, ఆవాల సాగుపై సలహాలు, సూచనలు కరువయ్యాయి.

ప్రైవేట్ కంపెనీల హవా

మన ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. బై బ్యాక్ పద్ధతిలో విత్తనోత్పత్తి చేపట్టి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తి కింద సాగు చేస్తే క్వింటాల్‌కు రూ.9 వేల వరకు ఇస్తున్నాయి. సాధారణ ఆవాలకు క్వింటాల్‌కు రూ.7–8 వేలు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు, ఆవాల పంటకు అడవి పందులు, రామచిలుకలు, కోతుల బెడద లేకపోవడం, పంటకు ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు 6–8 క్వింటాళ్ల దిగుబడి.. రూ.50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నా ఫలితం కనబడటం లేదు. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోయింది.

ఆశలు అడియాసలే..

కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తుందని ప్రకటించడంతో స్థానిక రైతులు సంతోషించారు. కానీ, మూడేళ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో వారి ఆశలు అడియాసలవుతున్నాయి. రాష్ట్ర పరిధిలోని పరిశోధన స్థానాలతో పోల్చితే, కేంద్రం ఏర్పాటు చేసే పరిశోధన స్థానాల్లో నిధులకు ఇబ్బందులు ఉండవని, వివిధ రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు చర్చించుకునే అవకాశం ఉంటుందని రైతులు భ్రమించారు. తోటల్లో ప్రదర్శనలు, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని కలలు కన్నారు.

నివేదికలకే పరిమితం

కొన్నేళ్లుగా ఉత్తర తెలంగాణ(పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగు చేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ వర్సిటీతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికలు పంపించారు. జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంతృప్తి వ్యక్తం చేస్తూ సానుకూలంగా నివేదికలు తయారు చేసి కేంద్రానికి పంపింది. కరోనాకు ముందు జరిగిన పరిశోధన మండలిలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని కోరారు. ఈనేపథ్యంలో కేంద్రం ప్రకటించినా అతీగతీ లేకుండా పోయింది.

కొత్తగా రెండు సబ్ జైళ్లు



కరీంనగర్ జైలు

- సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో ఏర్పాటుకు జైళ్లశాఖ ప్రతిపాదనలు
- కార్యరూపం దాల్చితే కరీంనగర్ జైలుకు తప్పనున్న భారం

సిరిసిల్ల: సమాజంలో నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా.. ఖైదీలు, నిందితులతో జైళ్లు నిండిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జైలులో వీరి సంఖ్య పరిమితి మించి ఉంది. దీంతో రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో కొత్తగా సబ్ జైళ్ల ఏర్పాటుకు జైళ్ల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

ఉమ్మడి జిల్లాలో మూడు..

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్‌లో ఒక జైలు, జగిత్యాల, హుజూరాబాద్‌లలో సబ్ జైళ్లు ఉన్నాయి. కరీంనగర్‌లో జైలులో 300 మంది ఖైదీలకే వసతులు ఉండగా.. 350 మంది వరకు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా ఖైదీలకు ప్రత్యేక బారక్స్ ఉండటంతో అందరికీ పూర్తిస్థాయిలో వసతుల్లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఇటీవల జైళ్ల శాఖ ఐజీ సౌమ్యమిశ్రా జైలును సందర్శించి, కొత్త జైళ్ల ఏర్పాటు ప్రతిపాదనలపై సమీక్షించినట్లు తెలిసింది.

నెలకు 60 మంది జైలుకు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 8 కోర్టుల్లో సిరిసిల్లలో రెండు, వేములవాడలో ఒక్క మున్సిఫ్ కోర్టులున్నాయి. వీటి ద్వారా ప్రతీ నెల సగటున 60 మంది కరీంనగర్ జైలుకు వెళ్తున్నారు. సిరిసిల్లలో ఇటీవలి కలంలో భూకబ్జాలు, గంజాయి సేవించేవారు, అమ్మేవారు, దొంగతనాలు, అత్యాచారాలు, పోక్సో కేసు, హత్యలు, హత్యాయత్నాలు, చీటింగ్ కేసులు పెరుగుతున్నాయి. ఇక్కడ సబ్ జైలు ఏర్పాటు చేస్తే.. ఈ ప్రాంతానికి చెందిన నేరస్తులు, నిందితులను ఇక్కడే ఉంచే అవకాశం ఉంటుంది.

సర్దాపూర్ శివారులో ఏర్పాటు!

సబ్ జైలు కార్యరూపం దాల్చితే.. సిరిసిల్ల పట్టణ శివారులోని సర్దాపూర్ వద్ద ఏర్పాటుకు అవకాశం ఉంది. అక్కడే 17వ పోలీస్ బెటాలియన్ ఉండగా.. 100 మంది ఖైదీలకు సరిపోయే సబ్ జైలు నిర్మాణానికి అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి.. సినారె



విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయేందర్ రెడ్డి, కవులు

కరీంనగర్ కల్చరల్: కల్మషం లేని మహా మనిషి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సినీ గేయ కవి సినారె అని పిల్లల వైద్య నిపుణుడు, సినారె కవితా పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన విశ్వంభరుడు అనే కవితా సంకలనాన్ని నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆవిష్కరించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. సినారె బహుభాషావేత్త అని, అలుపెరగని సాహితీ దిగ్గజమని కొనియాడారు. ఉదయ సాహితీ జిల్లా అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, కవులు అన్నాడి గజేందర్ రెడ్డి, నగునూరి రాజన్న, వేములవాడ ద్రోణాచార్యులు, గంప ఉమాపతి, బొమ్మకంటి కిషన్, పి.సత్యనారాయణరాజు, బొద్దుల లక్ష్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



సంక్రాంతి పురస్కార గ్రహీతలు..

సంక్రాంతి పురస్కారాలు ప్రదానం..

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని శతాధిక గ్రంథ ప్రచురణ కర్త, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. దూడపాక శ్రీధర్ అధ్యక్షతన ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించిన శ్రీ ఆర్యాణి సకల కళా వేదిక సంక్రాంతి ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గౌతమేశ్వర సాహితీ సేవా సంస్థ ప్రచురించిన ఇంతకీ నువ్వెవరు కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. జ్యోతిష్య, వాస్తు, పౌరోహిత్యం, చిందు యక్షగానం, సాహిత్యం తదితర రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గాయకుడు దీక్షితుల సుబ్రహ్మణ్యం, రచయిత ఒమర్ ఎజాస్ ఖాన్, కవి, సమీక్షకుడు పార్ల వేణుగోపాల్‌రావు, యోగా గురువు కళాధరరావు, యోగ శిక్షకుడు బుర్ర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మృతుడు నిజామాబాద్ వాసి

కోరుట్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పేయింటర్స్ కాలనీకి చెందిన షేక్ రషీద్(25) శనివారం సాయంత్రం కోరుట్ల భీముని దుబ్బలో ఉండే తన సోదరి ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి, జగిత్యాలలో ఉండే తన స్నేహితులను కలిసి, ఇంటికి వెళ్తానని చెప్పి, బైక్‌పై బయలుదేరాడు. వెంకటాపూర్ శివారులో జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వస్తున్న కోరుట్లకు చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రషీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కారు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి, ఆగిపోయింది. ఆ వాహనంలో ఉన్న ఆడెపు రాజు, గాజంగి మహేశ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి పరిశీలించారు. మృతుడి సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

ఇల్లందకుంట(హుజూరాబాద్): బైక్ అదుపుతప్పి, ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేశ్(35) ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇల్లందకుంట మండలం పాతర్లపల్లిలోని అత్తగారింటికి వెళ్తున్నాడు. హుజూరాబాద్ మండల కేంద్రంలో వాహనం అదుపుతప్పడంతో మురికి కాలువలో పడిపోయాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

మిడ్‌మానేరులో తెప్పపై సిరిసిల్ల ఎస్పీ షికారు



తెప్పపై ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి(చొప్పదండి): ప్రతీరోజు శాంతిభద్రతల పర్యవేక్షణలో బిజీగా ఉండే ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం సరదాగా గడిపారు. బోయినపల్లి మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయ పరిసరాల్లో మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో కలిసి తెప్పపై షికారు చేశారు. కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వరకు తెప్ప రైడ్ చేస్తూ ఆనందపడ్డారు. వారి వెంట ఎస్సై పృథ్వీధర్ ఉన్నారు.

ఆలయంలో చోరీ

కరీంనగర్‌రూరల్: దుండగులు రెండు ఆలయాల్లో చొరబడి, ఒక ఆలయ హుండీ డబ్బులను చోరీ చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్ మల్ల న్న, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాల్లో మైక్ వేసేందుకు వెళ్లిన కూకట్ల మల్ల య్య, తొగరు ఎల్లారెడ్డిలు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆంజనేయస్వామి హుండీలో డబ్బుల్లేవని, మల్లన్న ఆలయ హుండీలో సుమారు రూ.3 వేలు ఉన్నాయని తెలిపారు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన బోర్‌వెల్ వాహనం

మల్యాల(చొప్పదండి): బోర్‌వెల్ వాహనం చెట్టును ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై నరేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. బోర్‌వెల్ వాహనం ఆదివారం కొడిమ్యాల నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై స్టీరింగ్ ఫెయిలవడంతో చెట్టును ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జవగా, లోపల ఉన్న బిహార్ కార్మికులు సురేందర్, భీమ్, బాలరాం, నిధేశ్‌లతోపాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఫైనల్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు



ఫైనల్ చేరిన కరీంనగర్ జిల్లా జట్టు

- నేడు హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్



హ్యాండ్‌బాల్ సెమీ ఫైనల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్, వరంగల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం సాయంత్రం సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23–21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది. రెండో సెమీ ఫైనల్లో వరంగల్ జట్టు 28–15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై విజయం సాధించింది. సోమవారం ఉదయం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. అలాగే, మూడు, నాలుగో స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం..

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం లభిస్తాయని ఆర్ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, సురేశ్ అన్నారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో రెండో రోజు రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శబరిమల వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- బెంగళూరులో గుండెపోటుతో ధర్మారంవాసి మృతి



జంపయ్య (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లిన ఓ వ్యక్తి.. తిరుగు ప్రయాణంలో గుండెపోటుకు గురై, మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం మండల కేంద్రానికి చెందిన సమ్మంగి జంపయ్య(40) కరీంనగర్ జిల్లా బావుపేట క్వారీలో లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన మిత్రులతో కలిసి శబరిమల వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వివిధ ప్రాంతాల్లో దైవ దర్శనం చేసుకుంటూ ఆదివారం బెంగళూరు చేరుకున్నాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత ఛాతిలో నొప్పిగా, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉందని తెలిపాడు. దగ్గరలోని మెడికల్ షాప్‌కు వెళ్లి, మందులు తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అనారోగ్యంతో కోటయ్య మేస్త్రీ మృతి



కోటయ్య (ఫైల్)

వీణవంక: ఇళ్లు, ఆలయాల నిర్మాణాల్లో తనదైన ముద్ర వేసిన కోటయ్య మేస్త్రీ మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని బేతిగల్‌కు చెందిన ఇజ్జగిరి కోటయ్య(50) హుజూరాబాద్ నియోజకవర్గంలో 35 ఏళ్లలో 200కు పైగా ఇళ్లతోపాటు ఆలయాలు నిర్మించి, కోటయ్య మేస్త్రీగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన వద్ద పని చేసిన ఎంతోమంది కూలీలు ప్రస్తుతం మేస్త్రీలుగా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కోటయ్య తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

దాడిలో తల్లీకుమారులకు గాయాలు

- ఇద్దరిపై కేసు
- భూ వివాదమే కారణం



గాయపడిన పుష్పలత, కరుణాకర్, జగన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూ వివాదం కారణంగా జరిగిన దాడిలో తల్లీకుమారులు గాయపడ్డారు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన గడ్డం ఆనందం బండలింగంపల్లిలో నర్సయ్యకు సంబంధించిన 1.08 గుంటల భూమిని 2020లో కొనుగోలు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన బందుక శ్రీనివాస్, నరేశ్(తండ్రీకుమారుడు)లు నర్సయ్య విక్రయించిన భూమి తమదేనని ఆదివారం గొడవకు దిగారు. సదరు భూమి చదును చేయకుండా ఆనందం భార్య పుష్పలత, కుమారులు కరుణాకర్, జగన్‌లను అడ్డుకున్నారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించడంతో దుర్భాషలాడుతూ ఆ ముగ్గురిపై గడ్డపార, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తల్లీకుమారులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆనందం ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్‌లో ఆదివారం కోతి దాడి చేయడంతో మిట్టపల్లి వెంకటమ్మ అనే వృద్ధురాలు గాయపడిందని స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు ఆమెను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ అబ్బాయి.. కేరళ అమ్మాయి

- దుబాయ్‌లో పరిచయమై.. పెళ్లితో ఒక్కటైన జంట



వివాహం చేసుకున్న అజయ్–అజిత

మెట్‌పల్లిరూరల్: దుబాయ్‌లో పరిచయమైన తెలంగాణ అబ్బాయి.. కేరళ అమ్మాయి పెళ్లితో ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం అల్లూరి సీతారామరాజు తండాకు చెందిన గుగ్లావత్ అజయ్ నాలుగేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ తాను పని చేస్తున్న కంపెనీలో కేరళకు చెందిన అజితతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారింది. వివాహం చేసుకోవాలని నిశ్చయించుకొని, తమ పెద్దలను ఒప్పించారు. ఆదివారం కేరళలో అక్కడి సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు.

ఒక్కచోటకు 300 మంది శ్రీనివాస్‌లు



ఆత్మీయ సమ్మేళనంలో శ్రీనివాస్ పేరున్నవారు

జగిత్యాల క్రైం: ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీనివాస్ అనే పేరున్న 300 మంది ఒక్కచోట చేరారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పేరిట కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, వాట్సాప్ అడ్మిన్, ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాలకు చెందినవారు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి, కుటుంబసభ్యులు పూజలు చేసి, కోడెమొక్కు చెల్లించుకున్నారు.



కోడె మొక్కు చెల్లిస్తున్న విప్ బీర్ల ఐలయ్య కుటుంబీకులు

